సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం। 15। ఆగస్టు। 2025



● 'అల'కల్లోలం

అలల తాకిడికి జిల్లాలో భావనపాడు, బారువ, మంచినీళ్లపేట, దేవునల్తాడ, చినకొత్తూరు, అక్కుపల్లి, డోకులపాడు, సున్నాపల్లి ప్రాంతాల్లో తీరం కోతకు గురవుతోంది. తీరంలో లంగరు వేసిన పడవలు, తెప్పలు అలలు ఉధృతికి పాడువుతున్నాయి. వేట సాగకపోవడంతో మత్స్యకారులు ఇంటికే పరిమితం అవుతున్నారు.

–వజ్రపుకొత్తూరు

న్యూస్‌రీల్

169 మందికి అవార్డులు

శ్రీకాకుళం పాత బస్టాండ్‌: స్వాతంత్య్ర వేడుకలు ఉదయం 8.30 నుంచి ప్రారంభం కానున్నాయి. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా 169 మందికి ఉత్తమ ఉద్యోగులుగా అవార్డులు ఇవ్వనున్నారు. ఈ మేరకు గురువారం రాత్రి కలెక్టర్‌ జాబితా విడుదల చేశారు.

ఇంకేం అర్హత కావాలి..?



చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడి పేరు దాసరి కరువయ్య. పొందూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన ఈయన చిన్నతనం నుంచి పోలియోతో బాధ పడుతున్నాడు. తన ఎడమ చేయి పూర్తిగా పనిచేయదు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పైనే ఆధారపడి బతుకుతున్నాడు. ఇటీవల ఆయనకు ప్రభుత్వం ఓ నోటీసు పంపించింది. పింఛన్‌ ఇచ్చేంత వైకల్యం లేదని అందులో పేర్కొంది. ఇకపై పింఛన్‌ కూడా రాదంటూ సచివాలయ సిబ్బంది చెప్పేశారు. దీంతో ఆయన ఎంపీడీఓ వద్దకు వచ్చి ఇలా ఆవేదన వెలిబుచ్చారు. ఈ వైకల్యం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. – పొందూరు

లోలుగు కేజీబీవీలో ఆర్‌జేడీ విచారణ



కేజీబీవీ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

పొందూరు: మండలంలోని లోలుగు కేజీబీవీలో ఇటీవల బదిలీ అయిన ప్రిన్సిపాల్‌ ఆర్‌.సౌమ్యపై, పాఠశాలపై వచ్చిన పలు ఆరోపణలపై గురువారం కాకినాడ రీజనల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ జి.నాగమణి విచారణ జరిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని టీచింగ్, నాన్‌ టీచింగ్‌ స్టాఫ్‌ని ఒక్కొక్కరుగా పిలిచి విచారణ జరిపారు. ఒక ప్రశ్న పత్రాన్ని ఇచ్చి వాటికి సమాధానాలను రాతపూర్వకంగా తీసుకున్నారు. అలాగే పాఠశాలలో గల భోజన, వసతి సౌకర్యాలతో పాటు ఉపాధ్యాయులు, బోధనకు సంబంధించి పాఠశాలలోని సుమారు 287 మంది విద్యార్థినులకు తెల్ల కాగితాలను ఇచ్చి వారితో సమాధానాలు రాయించారు. అనంతరం రికార్డులను ఆమె పరిశీలించారు. ఆమెతో పాటు ప్రిన్సిపాల్‌ ఎస్‌.లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా శుక్రవారం జరగనున్న జిల్లాస్థాయి వేడుకలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. గురువారం వాన పడడంతో శకటాల సన్నద్ధత పనులకు కాస్త ఆటంకం ఏర్పడింది. రానున్న 24 గంటల్లో వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ ప్రకటనతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన వేదికతోపాటు వీఐపీలు, వీవీఐపీలు, ప్రెస్‌అండ్‌ మీడియా, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వాతంత్య్ర సమరయోధులు, వీక్షకులు ఇలా వేర్వేరుగా షామియానాలను సిద్ధం చేస్తున్నారు. పలు మార్గాల్లో ట్రాఫిక్‌ నిబంధనలను ఏర్పాటు చేశారు.

తపాలా గుండెలపై సిక్కోలు ముద్రలు

ప్రముఖుల పేరిట తపాలా కవర్ల ముద్రణ ● చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలపై స్టాంప్‌లు

శ్రీకాకుళం అంటే ఓ చరిత్ర. ఓ ఉద్యమం. కష్టజీవుల ఇలాకాగా.. ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే ప్రాంతంగా.. చారిత్రాక ఘటనలకు వేదికగా నిలిచిన ప్రాంతం. ఎన్నో విశిష్టతల సమాహారం. వీటినే.. ఈ సంగతుల్నే.. ఈ చారిత్రక గురుతుల్నే.. ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు ప్రయత్నం చేస్తోంది పోస్టల్‌ శాఖ. తపాలా సేవల్లో చారిత్రక, పేరెన్నిక గన్న విశిష్టతల్ని స్టాంప్‌లు, కవర్లపైన ముద్రించి నేటి తరానికి నాటి సంగతుల్ని పరిచయం చేస్తోంది. –శ్రీకాకుళం అర్బన్‌

స్వతంత్ర శ్రీకాకుళం

కవర్‌పై కంచుమోగింది..



జిల్లాలోని సారవకోట మండలం బుడితిలోని కంచు, ఇత్తడి వస్తువుల తయారీ పరిశ్రమలపై పోస్టల్‌ శాఖ దృష్టి సారించింది. 2022 ఏప్రిల్‌ 12న బుడితి వస్తువుల ప్రత్యేకతలపై కవర్‌ను విడుదల చేసింది. దీనికి 'బుడితి బెల్‌ అండ్‌ బ్రాస్‌మెటల్‌ క్రాఫ్ట్‌' అని నామకరణం చేసింది. కంచుగంట, ఇత్తడి, ఇతర లోహాలకు చెందిన దేవతా విగ్రహాలు, కొన్ని చిహ్నాలు, పాత్రల ఫొటోలను కవర్‌పై ముద్రించింది.

నేతగాళ్ల సృజనను కవర్‌ చేస్తూ..



గాంధీజీ నుంచి నవతరం వరకు అందరూ ఆ'ధరించి'న.. విశ్వఖ్యాతి గాంచిన పొందూరు ఖాదీపై 2019 డిసెంబర్‌ 5న ప్రత్యేక కవర్‌ విడుదల చేసింది. దానిపై రాట్నంతో పాటు గాంధీ మహాత్ముని ఫొటోను ప్రచురించారు. నిపుణులైన నేతగాళ్లు సృజించిన అద్భుతాల ఆనవాళ్లకు దక్కిన గొప్పగౌరవం ఈ కవర్‌. 'ప్రైడ్‌ ఆఫ్‌ పొందూరు.. గాంధీజీస్‌ చెరఖా' అని పోస్టల్‌ శాఖ నామకరణం చేసింది.

సర్దార్‌ సేవలకు సలామ్‌..

స్వాతంత్య్ర సమరయోధుడు ఉద్దానం ప్రాంతానికి చెందిన సర్దార్‌ గౌతు లచ్చన్నపై పోస్టల్‌ శాఖ ప్రత్యేక కవర్‌ను 2021 అక్టోబర్‌ 13న విడుదల చేసింది. ఈ ప్రత్యేక కవర్‌ను 'అన్‌సంగ్‌ హీరోస్‌ ఆఫ్‌ ఆంధ్రప్రదేశ్‌' అని పోస్టల్‌ శాఖ నామకరణం చేసింది.



'మాకొద్దీ తెల్లదొరతనము..'



స్వాతంత్రోద్యమ కవుల్లో గరిమెళ్ల సత్యనారాయణది విశిష్ట స్థానం. గరిమెళ్ల గేయాలు పాతక జనాన్ని ఉర్రూతలూగించాయి. 2023 డిసెంబర్‌ 18న గరిమెళ్ల పేరిట పోస్టల్‌ కవర్‌ను విడుదల చేసింది. 'మాకొద్దీ తెల్లదొరతనము' అంటూ ఆయన రాసిన గేయంలోని అక్షరాల్ని కవర్‌పై ముద్రించింది.

ఆధ్యాత్మిక ముద్ర..



జిల్లాను దేశ పటంలో ప్రత్యేకంగా నిలిపిన శతాబ్దాల చరిత్ర గలిగిన శ్రీకూర్మం, అరసవల్లి దేవాలయాల చిత్రాలను 2013లో స్టాంప్‌ రూపంలో తీసుకొచ్చింది. వాటి విశిష్టతలను ప్రపంచానికి మరోసారి తెలియజెప్పింది.

విదేశీ అతిథికి విఖ్యాతి..

ఏటా జిల్లాలోని తేలినీలాపురం ప్రాంతానికి తరలివచ్చే సైబీరియన్‌ పక్షులపై పోస్టల్‌ శాఖ 2021 సెప్టెంబర్‌ 6న ప్రత్యేక కవర్‌ను విడుదల చేసింది. దీనికి 'తేలినీలాపురం బర్డ్‌ శాంచ్యురీ' పేరుతో నామకరణం చేసింది.




పోరాటయోధుల పురిటిగడ్డ కనిమెట్ట II లో మహాత్ముడి పేరు.. మర్చిపోయారు!

షరతులు వర్తిస్తాయి

మహిళల ఉచిత బస్సు ప్రయాణాలకు షరతులు

- అరకొర బస్సులతో ఇప్పటికే అవస్థలు
- కొత్తగా బస్సులు సమకూర్చని ప్రభుత్వం
- కొన్ని బస్సుల్లోనే ఉచిత ప్రయాణానికి అనుమతి



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

'మీరు ఎక్కడకు కావాలంటే అక్కడకు ఆర్టీసీ బస్సులో వెళ్లండి.. ఎవరైనా టికెట్‌ అడిగితే చంద్రన్న చెప్పాడని చెప్పండి..' అంటూ ఎన్నికల ముందు చంద్రబాబు హామీలు గుప్పించారు. తీరా అమలు సమయానికి వచ్చాక సవాలక్ష ఆంక్షలు పెట్టి ఉచితానికి కూడా పరిమితులు విధించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నుంచి అమలు కానుంది. కానీ ఈ ప్రయాణాలకు షరతులు వర్తిస్తాయి. వైజాగ్‌ వెళ్దామని శ్రీకాకుళంలో నాన్‌స్టాప్‌ ఎక్కితే కుదరదు.. కాస్త కుదురుగా కూర్చుందామని అల్ట్రా డీలక్స్‌ ఎక్కితే ఉచితం ఉండదు.. పోనీ అన్నవరం వరకు వెళ్దామని సూపర్‌ డీలక్స్‌లో కూర్చుంటే టికెట్‌ తీసుకోవాల్సిందే. కాస్త అటూ ఇటూగా పేరు మార్చిన 'పల్లె వెలుగు'లకు మాత్రమే ఉచితం పరిమితం కానుంది.

మెలికలు...షరతులు

కూటమి ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు ప్రయాణం పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదు. మూడు గ్యాస్‌ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ మాదిరిగానే దీనికి కూడా షరతలు పెట్టారు. ఆడవాళ్లు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లే అవకాశం కల్పిస్తామని చెప్పి, ఇప్పుడు రకరకాల మెలికలు పెట్టి పిల్లి మొగ్గలు వేస్తున్నారు. జిల్లా వరకు నేరుగా ప్రయాణం చేయవచ్చని, అది కూడా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్‌ సర్వీసులకే మాత్రమే అని ఆంక్షలు పెట్టారు. ఒకవేళ ఇతర ప్రాంతానికి వెళ్లాలంటే సరిహద్దులో దిగి, ఆ పక్క జిల్లా బస్సు డిపోకి వెళ్లి మళ్లీ పల్లె వెలుగు బస్సులే ఎక్కాలని మెలిక పెట్టారు. ఉచిత బస్సు ప్రయాణంలో భాగంగా తిరుమల, శ్రీశైలం, సింహాచలం, అన్నవరం, విజయవాడ... ఇలా ఏ గుడికి అయినా, ఎంత దూరం అయినా వెళ్లి రావచ్చనుకుని మహిళలు భావించారు. కానీ వారి ఆశలపై నీళ్లు చల్లారు.

ఇప్పటికే ఆర్టీసీ కష్టాలు..



జిల్లాకు సంబంధించి ప్రధానంగా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో మహిళలు ఎక్కువగా ప్రయాణిస్తారు. పైడి భీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకు జాతీయ రహదారిపై ప్రయాణించే బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. విద్యార్థులు ఫుట్‌బోర్డులపై వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. తగిన సంఖ్యలో బస్సులు లేకపోవడంతో ప్రయాణ కష్టాలు చూస్తూనే ఉన్నాం. ఇప్పుడు ఉచితం కావడంతో దాదాపుగా మహిళలు బస్సుల కోసం ఎదురు చూడవచ్చు. ఉదయం 10లోపు, సాయంత్రం నాలుగు తర్వాత మహిళల రద్దీ ఎక్కువగా ఉంటుంది. బస్సులు అరకొరగా ఉన్న నేపథ్యంలో సమస్యగా మారనుంది. జిల్లాలో లక్షా 30వేల కిలో మీటర్ల మేర బస్సులు ప్రయాణం చేస్తున్నాయి. లక్షకు పైబడి జనం ప్రయాణిస్తున్నారు. మహిళలు 40వేల వరకు ఉన్నట్టు అంచనా. ఉచిత బస్సు అమలు కావడంతో ఈ సంఖ్య 50వేల నుంచి 60వేలకు పెరిగే అవకాశం ఉంది. మహిళల సంఖ్యకు తగ్గ బస్సులు లేకపోవడం వల్ల మిగతా ప్రయాణికులకు ఇబ్బంది తప్పేలా లేదు.

సిబ్బంది కొరత

జిల్లాలో ఆర్టీసీ పరిధిలో సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. ఇటీవల కాలంలో జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పెద్ద ఎత్తున పదవీ విరమణ పొందారు. దీంతో ఆయా డిపోల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. కొన్ని విభాగాల్లో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటున్నప్పటికీ డ్రైవర్, కండక్టర్ పోస్టులలో మాత్రం ఖాళీలు అలాగే ఉండిపోయాయి. ఇప్పుడున్న ఉద్యోగుల్లో అధిక శాతం మంది ఔట్‌సోర్సింగ్‌ సిబ్బంది, ఆన్‌కాల్‌ సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఉచిత ప్రయాణం అమలు చేస్తే దీని ప్రభావం ప్రయాణికులు, బస్సులపై తీవ్రంగా ప్రభావం చూపే అవకాశం ఉంది.

బస్సుల సంఖ్య పెంచాలి



జిల్లాలో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేవు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ప్రయాణం అమలు చేస్తే ప్రయాణం కోసం మహిళలు మరింత ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అన్ని బస్సులకూ ఈ సౌకర్యం కల్పించాలి. ఉచిత ప్రయాణం జిల్లాకు మాత్రమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉండేలా చూడాలి.

– ఉలాల భారతి దివ్య, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు

ఆంక్షలు వద్దు



ఎన్నికల సమయంలో మహిళలకు ఉచిత ప్రయాణమంటూ హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఆంక్షలు లేని ఉచిత ప్రయాణం అమలు చేయాలి. కేవలం పల్లె వెలుగు బస్సులకు మాత్రమే ఉచిత ప్రయాణం కాకుండా అన్ని బస్సులకూ వర్తింపజేయాలి.

– గుంట జ్యోతి, శ్రీకాకుళం

అరకొర బస్సులు..

జిల్లాలో 324 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. ఇవి ఎప్పుడు పనిచేస్తాయో తెలియని పరిస్థితి ఉంది. వర్కింగ్‌లో ఉన్న వాటిలో ప్రభుత్వం చెప్పిన షరతులతో 204 బస్సులు మాత్రమే వినియోగించుకునే పరిస్థితి ఉంటుంది. వీటిలో 30 వరకు డొక్కు బస్సులు ఉన్నాయి. ఈ లెక్కన అందుబాటులో ఉన్న బస్సుల సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉంది. ఇప్పుడు ఉచిత ప్రయాణం అంటే మరింత రద్దీ పెరిగి సామాన్య ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

సాయంత్రం 5 గంటల తర్వాతే..

శ్రీకాకుళం అర్బన్‌: కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీల్లో భాగంగా స్త్రీ శక్తి పేరిట ఏపీఎస్‌ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేస్తామని చెప్పారు. అయితే మహిళలకు ఈ ఉచిత ప్రయాణం శుక్రవారం సాయంత్రం 5గంటల తర్వాతనే ఉంటుంది. పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడలో అధికారికంగా సాయంత్రం 4.30గంటలకు ప్రారంభించనున్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణం అమలవుతుంది. అందులో భాగంగానే జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శుక్రవారం సాయంత్రం 4.30గంటలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారికంగా ప్రారంభించనున్నారు.

ప్రభుత్వం మా కడుపు కొడుతోంది

కొత్తూరు:

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలు చేయడంతో ఆటోలు, మ్యాక్సీ పికప్‌ వాహనాల డ్రైవర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమ కడుపు కొడుతోందని ఆటో యూనియన్‌ నాయకులు నీలయం నాయుడు, వాసు, ప్రసాద్, జమ్మయ్యలతో పాటు పలువురు అన్నారు. ఆటో డ్రైవర్ల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కొత్తూరులో గురువారం ఆందోళన నిర్వహించారు. ర్యాలీ చేసి తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌ కె.బాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు మాట్లాడుతూ వాహన మిత్ర పథకం అమలు చేశాకే ఉచిత బస్సు పథకం అమలు చేయాలని కోరారు. ఆటోడ్రైవర్లకు నష్టదాయకమైన 21 జీఓను రద్దు చేయాలన్నారు.



కొత్తూరులో ఆటో డ్రైవర్ల నిరసన ర్యాలీ

కడుపు కొడుతున్నారు



ఉచిత బస్సు పథకం అమలు చేయడం వల్ల ఆటో డ్రైవర్ల కడుపుపై కొట్టినట్టవుతుంది. ఉపాధి లేక డ్రైవర్లు వీధిన పడే ప్రమాదం ఉంది. ఆటో డ్రైవర్లను మరోవిధంగా ఆదుకోవాలి.

– జి.నీలంనాయుడు, ఆటో డ్రైవర్, కుంటిభద్ర

వాహన మిత్ర అమలు చేయాలి..



వాహన మిత్ర అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. తక్షణమే వాహన మిత్ర అమలు చేసి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి.

– సీహెచ్‌ వెంకటరమణ, ఆటోడ్రైవర్, కొత్తూరు

అప్పులు తీర్చడం కష్టం..



మహిళలకు బస్సులో ఉచితం వల్ల ఆటోలు ఎవరూ ఎక్కరు. అప్పులు చేసి వాహనాలు కొన్నాం. ఆ అప్పులు తీర్చడం కష్టమవుతుంది.

– కె.మిన్నారావు, ఆటోడ్రైవర్, కోసలి గ్రామం

● చిత్ర స్ఫూర్తి






స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని టెక్కలికి చెందిన ప్రముఖ చిత్రకారుడు కణితి అబ్రహం గీసిన చిత్రాలు ఆలోచింపజేస్తున్నాయి. మతాలు వేరైనా అంతా భరతమాత ముద్దు బిడ్డలే అని చూపుతూ చిత్రాలు గీశారు. నేటి భారతంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు చలించిపోతున్న భారతావని, శాంతి మార్గాన్ని ప్రతిబింబించే విధంగా మహాత్ముని మార్గం తదితర చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. –టెక్కలి



● స్వేచ్ఛా కవనం



గాంధీజీ మందిరం

శ్రీకాకుళం కల్చరల్‌: దేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాకుళం శాంతినగర్‌ కాలనీలో గాంధీ స్మారక నిధి బృందం పర్యవేక్షణలో గాంధీ గుడి, స్వాతంత్య్ర సమరయోధుల స్మృతి వనం రూపుదిద్దుకుంది. గాంధీజీ మందిరంతో పాటు 40 మంది స్వాతంత్య్ర యోధుల ప్రతిరూపాలను ప్రతిష్ఠించారు. ఆ ప్రాంతంలో అడుగు పెడితే ఓ వైపు గాంధీ గుడిలో ధ్యానముద్రలో మహాత్ముడు, గుడి పైభాగాన భరతమాతతో పాటు 15 అడుగుల బాపూజీ విగ్రహం, గుడి స్తంభాలపై మూడు మతాల చిహ్నాలు కనిపిస్తాయి. గుడి నలుమూలలా గాంధీజీ జీవితంలో జరిగిన ముఖ్య ఘట్టాలు ఉన్నాయి. ఇక్కడ జాతీయ జెండాను 105 అడుగుల ఎత్తులో ప్రతిష్ఠించుకోవడం మరో విశేషం.

● వజ్రోత్సాహం.. క్రీడా విన్యాసం..



తీత సంగిడితో క్రీడాకారుడి అద్భుత ప్రదర్శన



వివిధ ప్రదర్శనలతో సత్తాచాటుతున్న క్రీడాకారులు

జిల్లా 75 వసంతాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో సిక్కోలు వజ్రోత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు గురువారం శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ హైస్కూల్‌ వేదికగా జిల్లాస్థాయి గ్రామీణ క్రీడాపోటీలు జరిగాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో డీఎస్‌డీఓ డాక్టర్‌ కె.శ్రీధర్‌రావు పర్యవేక్షణలో కర్రసాము (సింగిల్, డబుల్), పిల్లి మొగ్గలు, ఇసురు గుండు, తీత సంగడి, ఈడుపు సంగిడి, ఉలవ బస్తా ఎత్తడం, బంపర్స్, ముగ్దర్‌ క్రీడల పోటీలు జరిగాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ముఖం చాటేశారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

క్లుప్తంగా

ప్రజాస్వామ్యం అపహాస్యం


కె.వి.జి.సత్యనారాయణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ గురువారం అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు మరీ దారుణంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఏజెంట్లు లేకుండా ఎన్నికలు జరగడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. పక్క మండలాలకు చెందిన టీడీపీ గూండాలను తీసుకొచ్చి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ఇంతటి దారుణమైన ఘటనలు జరిగినా ఎన్నికలు కమిషన్, పోలీసు యంత్రాంగం ఏమీ తెలియనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు గుర్తించి అక్రమాలకు ఒడిగట్టారన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల వినూత్న నిరసన


టీ తాగుతూ ప్రభుత్వ ఉద్యోగుల నిరసన

హిరమండలం: టీడీపీ కూటమి ప్రభుత్వ తీరుపై ఉద్యోగులు గురువారం వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు గాంధేయవాదం ప్రదర్శించారు. హిరమండలంలోని వంశధార ప్రాజెక్టు కట్టడాల విభాగం వద్ద 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హిరమండలం, ఎల్‌ఎన్‌పేట మండలాల నుంచి భారీగా ఉద్యోగులు తరలివచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు, న్యాయబద్ధ చెల్లింపులు, ప్రభుత్వ హామీలపై చర్చించారు. ప్రభుత్వం స్పందించే వరకూ ఐక్య పోరాటాలు చేద్దామని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం హిరమండలం తాలుకా యూనిట్ అధ్యక్షుడు మీసాల వరప్రసాదరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగ్గిలి కళ్యాణ్, జాయింట్ సెక్రటరీ పైడి రవికుమార్, పిసిని రమేష్, టింగ మనోజ్, పైల వెంకటరమణ, రామకృష్ణ, నడిమింటి షన్ముఖరావు, వసంతరావు,రేగేటి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పొలంలోనే ప్రాణం విడిచి..

- గుండెపోటుతో రైతు మృతి
- లావేరులో విషాదం


ఎచ్చెర్ల గొల్ల (ఫైల్)

రణస్థలం: లావేరుకు చెందిన ఎచ్చెర్ల గొల్ల (50) అనే రైతులు గుండె పోటుకు గురై పొలంలోనే మృత్యువాతపడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. లావేరు చెందిన గొల్ల అనే రైతు తాను కౌలుకు తీసుకున్న పొలానికి నీరు కడదామని గురువా రం మధ్యాహ్నం వెళ్లాడు. వ్యవసాయ బోరు రిపేర్ కావడంతో మెకానిక్‌ను పిలిపించి బాగు చేయించాడు. మధ్యాహ్నం 3గంటల సమయంలో వరి పొలానికి నీరు కడుతుండగా గుండెపోటు వచ్చి వరిచేనులో పడిపోయాడు. విగత జీవిగా పడి ఉన్న రైతును స్థానికులు గుర్తించి లావేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అప్పటి వరకు అందరితో కలిసి మెలిసి ఉండే గొల్ల ఆకస్మాత్తుగా చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈయన వ్యవసాయ పనులు లేనప్పుడు రణస్థలం జాతీయ రహదారిపై బస్టాప్ వద్ద చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగించేవాడు. భార్య భాగ్యలక్ష్మి కుమార్తె స్వరూప, కుమారుడు రామకృష్ణ ఉన్నారు.

సెప్టెంబర్ 13న లోక్ అదాలత్


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్ : కక్షిదారులు వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ఉత్తమ వేదికగా నిలుస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. సెప్టెంబర్ 13న జరగబోయే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కువ కేసులు రాజీ చేయడానికి బీమా సంస్థలు, న్యాయవాదులు చొరవ తీసుకోవాలని సూచించారు. మంగళవారం జిల్లా కోర్టు భవనంలో బీమా సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. వివాదాలు త్వరగా పరిష్కరించడానికి అదాలత్ మేలు చేస్తుందన్నారు. సమావేశంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.సువర్ణ రాజు, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుల పురిటిగెడ్డ.. కనిమెట్ట

- దేశ స్వాతంత్య్ర సంగ్రామంలో పది మంది వీరులు
- బ్రిటీషర్లను వణికించేలా పోరాటం


కనిమెట్ట గ్రామం (ఇన్‌సెట్లో) ప్రజాగాయకుడు నంద కృష్ణమూర్తి

పొందూరు:

జిల్లాలో స్వాతంత్య్ర సమరయోధుల గురించి మాట్లాడేటప్పుడు ముందుగా గుర్తుకొచ్చే గ్రామాల్లో పొందూరు మండలం కనిమెట్ట ఒకటి. 'స్వాతంత్య్రం నా జన్మహక్కు.., మా కొద్దీ తెల్లదొరతనం' వంటి స్వరాజ్య గీతాలతో హోరెత్తించిన ఆ పల్లె స్వాతంత్య్ర యోధుల ఖిల్లాగా ప్రసిద్ధి చెందింది. ఉత్తరాంధ్రకే తలమానికంగా నిలిచింది. పది మంది స్వాతంత్య్ర సమరయోధులకు జన్మనిచ్చిన పల్లెగా కనిమెట్ట చరిత్ర పుటల్లో శాశ్వత స్థానం సంపాదించుకుంది. నంద కృష్ణమూర్తి, నంద ఆదినారాయణ, కూన ఎర్రయ్య, కూన అప్పలసూరి, కూన బుచ్చయ్య, గురుగుబెల్లి సత్యనారాయణ, బొడ్డేపల్లి రాములు, బొడ్డేపల్లి నారాయణ, అన్నెపు అప్పయ్య, నంద నర్సయ్యతో పాటు వారి ప్రధాన అనుచరులు 1942 ఆగష్టు 9 నుంచి ఆ ఏడాది చివరి వరకు జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టయ్యారు. కనిమెట్ట స్వాతంత్య్ర యోధులు కళింగపట్నం తపాలా కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. విజయనగరం, పలాస, బ్రాహ్మణ తర్ల తదితర చోట్ల నిర్వహించిన సత్యాగ్రహ ఉద్యమాల్లో పాల్గొని లాఠీదెబ్బలు తిన్నారు. విజయనగరం, చీపురుపల్లి, నరసన్నపేట, బళ్లారి జైళ్లలో నిర్బంధానికి గురయ్యారు. గాంధీజీ దూసి రైలు నిలయంలో బహిరంగ సభ నిర్వహించినపుడు జన సమీకరణ చేసి తమ వంతు బాధ్యత నిర్వహించారు. చౌదరి సత్యన్నారాయణ సారథ్యంలో వీరంతా ఉద్యమానికి బాసటగా నిలిచారు. గౌతు లచ్చన్నను నిర్బంధించేందుకు ఆంగ్లేయులు సమాయత్తం కావడంతో ఈ యోధులంతా తోలాపి, షేర్ మహ్మద్ పురం గ్రామాల్లోని రహస్య స్థావరాల్లో దాచిపెట్టారు. అలాగే ఆచార్య ఎన్‌జీ రంగాకు కూడా కొన్ని రోజుల పాటు ఈ ప్రాంతంలో రహస్యంగా ఆశ్రయం కల్పించారు.


గురుగుబెల్లి సత్యనారాయణ అందుకున్న తామ్రపత్రం

స్వతంత్ర శ్రీకాకుళం

మహాత్ముడి పేరు మర్చిపోయారు!

- దూసి రైల్వేస్టేషన్‌కు కలగా మిగిలిన గాంధీ పేరు
- రెండు దశాబ్దాలుగా నెరవేరని పేరు మార్పు
- కనీస అభివృద్ధికి నోచుకోని వైనం


గాంధీజీ పేరు కోసం అప్పట్లో రైల్వేస్టేషన్‌లో దూసి పేరు తొలగించిన దృశ్యం

ఆమదాలవలస రూరల్: స్వాతంత్య్ర పోరాటంలో భాగంగా ఉప్పు సత్యాగ్రహం సమయంలో దూసి రైల్వేస్టేషన్‌లో జాతిపిత మహాత్మా గాంధీ అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలో దూసి రైల్వేస్టేషన్‌కు మహాత్మాగాంధీ పేరు పెట్టేందుకు నేతలు హామీ ఇచ్చి నా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. దూసి రైల్వేస్టేషన్‌ను గాంధీజీ రైల్వేస్టేషన్‌గా పేరు మార్చేందుకు 2002లో అప్పటి కేంద్ర సహాయ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు మరికొందరు నాయకులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర రైల్వేశాఖ నుంచి అనుమతులు వస్తాయని ఆశించారు. అయినా ఫలితం లేకపోయింది. ఎర్రన్నాయుడు కుమారుడు రామ్మోహన్‌నాయుడు పలుమార్లు పార్లమెంట్ సభ్యుడిగా గెలుపొందట మే కాకుండా ప్రస్తుతం కేంద్రంలో పౌరవిమానయాన శాఖ మంత్రిగా కూడా పనిచేస్తున్నారు. తన తండ్రి ఇచ్చిన హామీ నెరవేర్చటంలో పూర్తిగా విఫలమయ్యారు. వీరే కాకుండా కాంగ్రెస్ పాలనలో కిల్లి కృపారాణి కూడా కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. మరికొందరు పార్లమెంట్ సభ్యులుగా పని చేశారు. అయినా గాంధీజీ నామకరణం చేయటంలో మాత్రం విఫలమయ్యారు.


జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం

పేరు తొలగించినా...

రైల్వేశాఖ నుంచి అప్పట్లో అనుమతులు వస్తాయని నాయకులు ఎంతో నమ్మకంగా చెప్పటంతో స్థానిక రైల్వేశాఖ అధికార్లు దూసి రైల్వేస్టేషన్ పేరును తొలగించారు. తర్వాత ఏ విషయం చెప్పకపోవడంతో పేరు లేకుండానే స్టేషన్ దర్శనమిస్తోంది. అదే విధంగా, స్టేషన్ పరిధిలో గాంధీజీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు రైల్వే ప్లాట్‌ఫాంలో గోతులు తవ్వారు. అయితే నామకరణానికి అనుమతి రాకపోవటంతో పతాక ఆవిష్కరణ, రచ్చబండ నిర్మాణంతో సరిపెట్టుకున్నారు.

మారని స్టేషన్ దుస్థితి..

దూసి రైల్వేస్టేషన్ అభివృద్ధికి ఆమడ దూరంగానే నిలిచిపోయింది. ప్రయాణికులకు కనీస సౌకరాలు లేక అవస్థలు పడుతున్నారు. ఫ్లై ఓవర్, కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి దూసిస్టేషన్‌కు గాంధీ పేరు పెట్టడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఉత్సాహంగా వజ్రోత్సవ పోటీలు


డిబేట్ పోటీలో పాల్గొన్న విద్యార్థిని

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా ఏర్పడి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం పోటీలు గురువారంతో ముగిశాయి. నియోజకవర్గ స్థాయిలో 75 మందిని ఎంపిక చేసి తుది పోటీలు ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు.

విజేతలు వీరే..

వ్యాసరచన: ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కె.నక్షత్ర ప్రథమ, టెక్కలి విశ్వజ్యోతి జూనియర్ కళాశాల విద్యార్థిని జె.ఇందు ద్వితీయ, ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి ఎం. మేఘరాజ్ తృతీయ స్థానాలు సాధించారు.

డిబేట్: చాపర ఎస్‌కేకే జూనియర్ కళాశాల విద్యార్థిని ఏ.ప్రియాంక, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి జి.శ్రావణి, సారవకోట కార్మెల్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్.రుతో తొలి మూడు స్థానాలు సాధించారు.

చిత్రలేఖనం: ఆమదాలవలస ఎంజేపీ ఏపీబీసీడబ్ల్యూ కళాశాల విద్యార్థిని పి.ధనశ్రీ ప్రథమ, పలాస శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థిని టి.జ్యోత్స్న ద్వితీయ, నౌపడా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బి.దీపిక తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలను రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ప్రగడ దుర్గారావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొంతలెంక సుధ అభినందించారు.

భోజనంలో నిద్రమాత్రలు కలిపి..

- ప్రియుడి సాయంతో భర్తను హత్య చేసిన భార్య
- వ్యక్తి అనుమానాస్పద మృతి కేసులో ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మణరావు. వెనుక నిందితులతో పోలీసులు

పాతపట్నం : పాతపట్నం మేజర్ పంచాయతీ మొండిగల వీధికి చెందిన నల్లి రాజు (34) మృతి కేసును పోలీసులు ఛేదించారు. ప్రియుడు, మరొకరి సాయంతో భార్యే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు విచారణలో గుర్తించి ముగ్గురినీ అరెస్టు చేశారు. ఈ మేరకు గురువారం పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. పాతపట్నం మొండిగలవీధికి చెందిన నల్లి రాజుకు మౌనికతో ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. మౌనికకు పాతపట్నం మాదిగవీధికి చెందిన గుండు ఉదయ్ కుమార్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో రాజును హత్య చేయాలని మౌనిక.. తన భార్యకు విడాకులు ఇవ్వాలని ఉదయ్‌కుమార్ నిర్ణయించుకున్నారు. తర్వాత ఎక్కడికైనా పారిపోయి వివాహం చేసుకోవాలని భావించారు.

పక్కా పథకం ప్రకారం..

మౌనిక, ఉదయ్‌కుమార్ కలిసి రాజు హత్యకు పథకం వేశారు. కొత్త ఫోన్ నంబరుతో అమ్మాయిలా చాటింగ్ చేసి ఉదయ్‌కుమార్‌ను ఎక్కడికైనా రప్పించి చంపాలని నిర్ణయించుకున్నా సాధ్యం కాలేదు. దీంతో నిద్రమాత్రలు ఇచ్చి చంపాలని కుట్ర పన్నారు. ఇందుకు ఉదయ్‌కుమార్ తన బావ మాదిగవీధికి చెందిన చౌదరి మల్లికార్జున్ అలియాస్ మల్లికార్జునరావు సహాయం కోరాడు. కుట్రలో భాగంగా ఉదయ్‌కుమార్ పర్లాకిమిడిలో ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద పది నిద్రమాత్రలు కొని మౌనికకు ఇచ్చాడు. మౌనిక ఈ నెల 5న రాత్రి భోజనంలో నాలుగు నిద్ర మాత్రలు కలిపి పెట్టింది. భర్త వెంటనే నిద్రలోకి వెళ్లడం గమనించి చంపవచ్చని నిర్ధారణకొచ్చింది. ఈ నెల 6న రాత్రి భోజనంలో ఆరు మాత్రలను కలపడంతో రాజు గాఢ నిద్రలోకి వెళ్లిపోయాడు. మౌనిక వెంటనే ప్రియుడు ఉదయ్‌కుమార్, చౌదరి మల్లికార్జునరావులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. రాత్రి 11.30 సమయంలో ఇద్దరూ వీధి లైట్లు ఆపేసి మౌనిక ఇంటికి వెళ్లారు. రాజు కాళ్లు, చేతులను మౌనిక, మల్లికార్జునరావు పట్టుకోగా.. ఛాతిపై ఉదయ్‌కుమార్ కూర్చుని తలగడతో ఊపిరి ఆడకుండా చంపేశారు. అనంతరం రాజు మృతదేహంతో పాటు బైక్, చెప్పులు, మద్యం బాటిల్‌ను హరిజనవీధికి దిగువన పడేసి వెళ్లిపోయారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మౌనిక తన భర్త ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. మరుసటి రోజు ఉదయాన్నే మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మౌనిక ఏడుస్తున్నట్లు నటిస్తూ భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురినీ నిందితులుగా గుర్తించారు. దీంతో మౌనిక, ఉదయ్‌కుమార్, మల్లికార్జునరావులు రెవెన్యూ అధికారుల వద్ద లొంగిపోయారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసిన సీఐ వి.రామారావు, ఎస్‌ఐ బి.లావణ్య, పీసీలు బి.జీవరత్నం, డి.గౌరీశంకర్‌రావు, పరమేష్‌లను అభినందించి, రివార్డులను అందజేశారు.

బ్యాంకు దోపిడీకి విఫలయత్నం

- గోడకు రంధ్రం పెడుతుండగా గమనించిన స్థానికుడు
- పారిపోయిన దుండగులు
- శ్రీకూర్మంలో ఘటన


యూనియన్ బ్యాంకు వద్ద వివరాలు సేకరిస్తున్న సీఐ పైడపునాయుడు, ఎస్‌ఐ గంగరాజు

గార : శ్రీకూర్మం యూనియన్ బ్యాంకులో దోపిడి చేసేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో బ్యాంకు గోడకు రంధ్రం పెట్టి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. పశ్చిమ వైపునున్న మేనేజర్ గది కిటికీపై సన్‌స్లేడ్ సమీపంలో మూడు ఇంచీల మేర రంధ్రం చేయడంతో పాటు పక్కనే ఉన్న ఇంటర్‌గ్రిల్ తొలగించేందుకు ప్రయత్నం చేశారు. ఆ సమయంలో బ్యాంకు పైన నివసిస్తున్న ఓ వ్యక్తి కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. కన్నం పెట్టేందుకు ఉపయోగించిన, సుత్తి, కత్తవ, సన్నిగొద్ద (రాయి)ని అక్కడే వదిలేశారు. వెంటనే స్థానికులు బ్యాంకు సిబ్బందికి తెలియజేశారు. గురువారం ఉదయం బ్యాంకు మేనేజర్ చినరామయ్య గార పోలీసులకు సమాచారం అందించారు. ఒకటో పట్టణ స్టేషన్ సీఐ పైడపునాయుడు, ఎస్‌ఐ గంగరాజు, సీసీటీఎస్ సిబ్బంది బ్యాంకు పరిసరాలను పరిశీలించారు. శ్రీకూర్మం గ్రామంలో రాత్రి 11 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడం, ఆ సమయంలో దొంగతనానికి పాల్పడటం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. శ్రీకూర్మం మెయిన్ రోడ్డులో ఉన్న ఈ బ్యాంకుపై ఆరు కుటుంబాలు నివసిస్తుండగా, ఎదురుగా కొన్ని కుటుంబాలున్నాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


బ్యాంకు గోడకు పెట్టిన రంధ్రం

బైక్ చోరీపై దర్యాప్తు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా ఉన్న జిల్లా న్యాయస్థానం ఆవరణలో సిబ్బంది ద్విచక్ర వాహనం నెలరోజుల ముందు అదృశ్యమైంది. ఈ విషయమై రెండో పట్టణ పోలీసులకు అప్పట్లోనే ఫిర్యాదు అందింది. నిందితుని జాడ ఇప్పటికీ దొరకకపోవడంతో సీసీటీఎన్‌ఎస్ పోలీసులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. గతంలో పదికి పైగా ద్విచక్ర వాహనాలను దొంగిలించిన ఒడిశా నిందితుడే ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించి తీవ్రంగా గాలిస్తున్నారు.

హత్య కేసులో నిందితులకు రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : తన వద్ద పని చేసిన దినసరి కూలీపై దాడిచేసి అతని మృతికి కారణమైన పండ్ల యజమానికి, సహకరించిన రామకృష్ణకు జిల్లా కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ గురువారం వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ వద్ద ఈ నెల 3న పండ్లషాపు యజమాని చీకటి వంశీకృష్ణ, అతని మిత్రుడు ఎం.రామకృష్ణలు లెక్కల్లో తేడా చూపించాడంటూ ఉల్లాకుల రాజేష్‌ను మద్యం మత్తులో దాడికి పాల్పడ్డారు. అదేరోజు అర్ధరాత్రి నిర్లక్ష్యంగా రాజేష్‌ను వారి ఇంటి ముందే పడేయడం.. భార్య, కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించడం.. మంగళవారం చికిత్స పొందుతూ రాజేష్ మృతిచెందిన తెలిసిందే. మొదట 81/25 ఐపీసీ సెక్షన్‌గా కేసు నమోదు చేశామని తర్వాత హత్యాకేసుగా పరిగణనలోకి తీసుకుని బుధవారం నిందితులిద్దరినీ అరెస్టు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

శ్రీకాకుళం న్యూకాలనీ:

అధికార యంత్రాంగమంతా సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పిలుపునిచ్చారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో 1వ, 2వ, 4వ, 7వ స్థాయీ సంఘాల సమావేశాల్లో పలు శాఖల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచు కుని అధికారులు పనిచేయాలన్నారు. సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున ముందస్తుగా సమాయత్తం కావాలన్నారు. కవిటి, సోంపేట ప్రాంతాల్లో కిడ్నీ రోగులకు డయాలసిస్ సౌకర్యాలు పెంచడం, అవసరమైన బెడ్లను కల్పించడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని ఎంపీడీవోల కు సూచించారు. డీడబ్ల్యూఎంఏ ద్వారా పూర్తయిన పనుల బిల్లులు తక్షణం చెల్లించాలని, పంచాయతీ రాజ్‌శాఖ కాలం చెల్లిన పనుల జాబితాను సమర్పించాలని ఆదేశించారు. ఉద్దానం పైప్‌లైన్ లీకేజీలను సరిచేయాలన్నారు. లోవోల్టేజి సమస్యలను పరిష్కరించాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం జరిగిన 3వ, 5వ, 6వ స్థాయీ సంఘాల సమావేశాల్లో కూడా పలు అభివృద్ధి పనుల ప్రగతిని సమీక్షిస్తూ, ప్రజా అవసరాల తీర్చడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశాల్లో జిల్లా అధికారులు, జెడ్పీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టపగలే తల పగలగొట్టి..

- పట్టుపురంలో మహిళపై దాడి
- బురఖా ధరించి చోరీకి ప్రయత్నించిన మరో మహిళ


తీవ్రంగా గాయపడిన కాంచన

మెళియాపుట్టి : పట్టపగలే ఓ మహిళ చోరీకి ప్రయత్నించడమే కాకుండా.. మరో మహిళపై దాడి చేసి పారిపోయిన ఘటన మెళియాపుట్టి మండలం పట్టుపురంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. పట్టుపురం గ్రామానికి చెందిన అంబల కాంచన ఎప్పటిలాగే గురువారం మెళియాపుట్టిలో ఉన్న సాయిబాబా ఆలయంలో సేవకు వెళ్లింది. కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చింది. ఆ సమయంలో తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వచ్చి చూసేసరికే తలుపు చాటున బురఖా ధరించి ఉన్న గుర్తు తెలియని మహిళ ఇనుపరాడ్డుతో మహిళపై దాడికి పాల్పడింది. బాధితురాలు కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. గ్రామస్తులు వచ్చేసరికే గుర్తు తెలియని మహిళ ఒడిశా స్కూటీపై గారబంద వైపు వెళ్లిపోయింది. గ్రామస్తులు వెంబడించినా ఆమె ఆచూకీ లభించలేదు. విషయం తెలుసుకున్న పాతపట్నం సీఐ వి.రామారావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. నగదు, విలువైన వస్తువులు ఏవైనా చోరీకి గురయ్యాయా?లేదా? అనేకోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. కాగా, బాధితురాలి భర్త ఆర్టీసీలో డ్రైవర్ గా విధుల్లో ఉండగా.. ఇద్దరు కుమారులు ఉపాధి నిమి త్తం వలస వెళ్లారు.


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న పాతపట్నం సీఐ రామారావు

అల్పపీడనంతో విద్యుత్ శాఖ అప్రమత్తం

శ్రీకాకుళం న్యూకాలనీ: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా జిల్లాలో వర్షాలు పడుతున్నాయని, ఈ నెల 17 వరకు భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు వేసే అవకాశం ఉన్నందున విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ శ్రీకాకుళం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి సూచించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. తడి విద్యుత్ స్తంభాలను తాకవద్దని, వేలాడుతున్న వైర్లను పట్టుకోవద్దని, వాటి కింద నడవవద్దని, చెట్లపై పడిన విద్యుత్ వైర్లకు దగ్గరగా పోవద్దని సూచించారు.

మూడు డివిజన్లలో హెల్ప్‌డెస్కులు..


నాగిరెడ్డి కృష్ణమూర్తి ఎస్‌ఈ

రానున్న మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగవచ్చని, ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగదారుల అవసరార్థం హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామని చెప్పారు. శ్రీకాకుళం డివిజన్(9490610045), టెక్కలి డివిజన్(8332843546), పాతపట్నం డివిజన్(7382585630) ప్రజలు ఈ నంబర్లను సంప్రదించాలని కోరారు. విద్యుత్ సరఫరాలో లోపాలు, విద్యుత్ వైర్లు పడిపోయిన/వేలాడుతున్న విద్యుత్ స్తంభాలు కనిపించిన వెంటనే సంబంధిత హెల్ప్ డెస్క్‌కి సమాచారం అందించాలని కోరారు.

255 మంది సిబ్బంది..

ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా 255 మంది సిబ్బందిని నియమించినట్లు నాగిరెడ్డి చెప్పారు. 15 వాహనాలు, 13 క్రేను, ఆరు పోల్ డ్రిల్లింగ్ మెషీన్లు, 30 పవర్ సాస్, 150 ట్రాన్స్‌ఫార్మర్లు, 500 విద్యుత్ స్తంభాలను సిద్ధం చేసినట్లు వివరించారు. పూర్తి వివరాలకు శ్రీకాకుళం సర్కిల్ హెల్ప్ డెస్క్: 9490612633, ఏపీఈపీడీసీఎల్ టోల్ ఫ్రీ: 1912 నంబర్లను సంప్రదించవచ్చని ఎస్‌ఈ పేర్కొన్నారు.